క్లుప్తంగా

19న వాహనాల వేలం

సాలూరు: స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 19వ తేదీన వేలం వేయనున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సారా, గంజాయి తరలింపు కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, ఓ వ్యాన్‌ను వేలం వేస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని, వాహనాలు సొంతం చేసుకోవాలన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బలిజిపేట: స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి మండల ఉపాధ్యాయులు ఆర్థికసాయం చేశారు. మండల కేంద్రంలో ఎంఈవో సామల సింహాచలం చేతుల మీదుగా సిబ్బందికి రూ.1.11 లక్షలు శనివారం అందజేశారు. మండల విద్యాశాఖలో సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఎల్‌డీఏ, ఎంఐఎస్, మెసెంజర్, సీఆర్‌ఎంటీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కారణంగా వారికి ఉపాధ్యాయులు సాయం చేసినట్లు ఎంఈవో తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పార్వతీపురంటౌన్: మండలంలోని కారాడవలస, పెదబొండపల్లి, పుట్టూరు, సూడిగాం, ఎమ్మార్ నగరం, సంగంవలస, ఆర్‌కే బట్టివలస, చినబొండపల్లి, పెదమరికి, చినమరికి, లక్ష్మీనారాయణపురం, వెంకంపేట, నర్సిపురంతో పాటు పట్టణంలోని వైకేఎం కాలనీలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ వెంకటరత్నం ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. నర్సిపురం సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ అంతరాయం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ పాపారావు

బలిజిపేట: స్థానిక ఎస్‌ఐగా వి.పాపారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం నుంచి బదిలీపై రాగా, ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు చేపట్టిన ప్రశాంత్‌కుమార్ పాలకొండ బదిలీపై వెళ్లారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానని ఎస్‌ఐ తెలిపారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

సీతానగరం: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ఎఫ్‌సీఐ ప్రతినిధులు సిబారం పాడి, ప్రశాంత్, రామకృష్ణ అన్నారు. మండలంలోని ధాన్యం కొనుగోలు చేపడుతున్న పలు ఆర్‌బీకేలను శనివారం సందర్శించిన వారు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతుందా లేదా అనే అంశంతో పాటు రైతుల ధాన్యం రవాణాకు కల్పిస్తున్న సౌకర్యాలు, ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లుల చెల్లింపు విషయాలపై ఆరాతీశారు. దళారులను ఆశ్రయించి, రైతులు మోసపోవద్దన్నారు.

సుభాషిణికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సుభాషిణి

సీతానగరం: బోటనీ(వృక్షశాస్త్రం)లో కురమాన సుభాషిణికి డాక్టరేట్ లభించింది. మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన ఈమె పరాన్నజీవి మొక్కపై చేసిన విస్తృత పరిశోధనకు గాను ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సమీత చేతులమీదుగా డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. బోటనీ విభాగం అధిపతి ఆచార్య పీకే రత్నకుమార్ పర్యవేక్షణలో ఈకోఫిజియాలజీ, ఎథినో బోటనీ అండ్ ఫొటో కెమికల్ ఎనాలసిస్ ఆఫ్ డెండ్రోఫ్థియా ఫల్కేటా-ఏ పారాసైటిక్ ఫ్లవరింగ్ ప్లాంట్ సమర్పించారు. లోరాంథేసి కుటుంబానికి చెందిన డెండ్రోఫ్థియా(లొరాంథస్) మామిడిచెట్లు (మాంజిఫెరా ఇండికా)పై పర్నాన్నజీవి మొక్కగా వైవిధ్యమైన జీవనం సాగిస్తుందని ఆమె పరిశోధనలో కనుగొన్నారు. పక్షుల ద్వారా విత్తన వ్యాప్తి, ఔషధ గుణాలు కలిగిన ఫైటో కాంపౌండ్స్ ఈ పరాన్నజీవి మొక్కలో ఉన్నట్లు ఆమె తన అధ్యయనంలో తెలిపారు.

ఫీజు చెల్లింపునకు గడువుపెంపు

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ(మద్రాస్) ఆధ్వర్యంలో నిర్వహించే హిందీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు శనివారం తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ స్థాయిలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరిలో పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ 99499 17365ను సంప్రదించాలని కోరారు.

పిల్లల చదువుపై పర్యవేక్షణ తప్పనిసరి

- జాయింట్ కలెక్టర్ గోవిందరావు

సాలూరు: పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని, అలా అయితేనే పిల్లలు ఉత్తమ విద్యార్థులుగా, పౌరులుగా రూపొందగలరని జాయింట్ కలెక్టర్(జేసీ) గోవిందరావు అన్నారు. పాచిపెంట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి ఆయన శనివారం హాజరై, పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ పిల్లలు పాఠశాలలో ఏం చదివారు, ఉపాధ్యాయులు ఏం చెప్పారన్న విషయాలపై తల్లిదండ్రులు ఆరాతీయాలని, ఇది పిల్లలు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఏదైనా సబ్జెక్ట్‌లో పిల్లలు వెనకబడి ఉంటే ఆ సబ్జెక్ట్ టీచర్‌తో మాట్లాడి, పిల్లవాని చదువు ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరాలన్నారు. విద్యార్థుల చదువుతో పాటు ఉపాధ్యాయుల శ్రద్ధ, తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉంటేనే చదువులో ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. అనంతరం మండలంలోని విశ్వనాథపురంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను, అమ్మవలస గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, తహసీల్దార్ రాజశేఖర్, ఏవో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

మక్కువ: పదో తరగతి విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో పెంట సత్యనారాయణ సూచించారు. మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పబ్లిక్ పరీక్షలకు ఇంకా 90 రోజుల గడువు మాత్రమే ఉన్నందున ప్రతిరోజూ పిల్లలు ఏం చదువుతున్నారు.. ఎలా చదువుతున్నారన్న అంశాలను తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. ఇలా చేస్తే విద్యార్థులు కూడా బాగా చదివి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల జరిగిన ఎస్ఏ-1 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎంఈవో, సర్పంచ్ సెల్ఫీలు దిగి, విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ మరడ వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మక్కువ: పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమైన ఎంఈవో సత్యనారాయణ

విద్యతో ఉజ్వల భవిష్యత్



స్టూడెంట్ లీగల్ లిటరసీ క్లబ్ పేర్లు రికార్డు ప్రారంభిస్తున్న అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సౌజన్య

- అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి.సౌజన్య

పార్వతీపురంటౌన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులంతా బాగా చదువుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి.సౌజన్య ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన స్టూడెంట్ లీగల్ లిటరసీ క్లబ్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె క్లబ్ ద్వారా కళాశాలకు సమకూర్చిన మేగజిన్లు, కంప్యూటర్, ఇతర వస్తుసామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే తక్షణమే కళాశాల సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రతీ విద్యార్థి ఓ నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని, నిరంతరం దాని సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఆకుల రాజు, తెర్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళల ఆర్థికాభివృద్ధి

సాలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ గిరి రఘు అన్నారు. స్థానిక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌ను వారు శనివారం పరిశీలించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో నిర్వహిస్తున్న ఈ మార్ట్‌లతో ఎంతోమంది మహిళలకు జీవనోపాధి దొరికిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పుష్ప, కౌన్సిలర్లు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌లో విక్రయిస్తున్న ఉత్పత్తులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ఓటే వజ్రాయుధం



ఓటు పదం ఆకారంలో కూర్చొని ఉన్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్: రాజ్యాంగ పరిరక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిదని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందాలని జిల్లా వృత్తి విద్యశాఖాధికారి మంజులా వీణ అన్నారు. స్థానిక పట్టణంలో వృత్తి విద్య కళాశాల విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఓటు ఆవశ్యకత, విలువ, గొప్పతనం వివరించారు. దేశ భవిష్యత్‌ను మార్చే ఏకైక ఆయుధం ఓటు ఒక్కటేనన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన యువతీ,యువకులంతా తప్పనిసరిగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకుని, ఓటుహక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, జె.రామారావు, అధ్యాపకులు ఆకుల రాజు, తెర్లి రవికుమార్, శ్రీనివాసరావు, రవికాంత్, కై లాశ శ్రీధర్, లక్ష్మణరావు, శర్మ, వెంకటేశ్వరరావు, రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉపాధ్యాయ సంఘాల నేతలతో మాట్లాడుతున్న ఎంఈవో-1 సింహాచలం

బలిజిపేట: మండల స్థాయిలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఈవో-1 సామల సింహాచలం అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల నేతలతో శనివారం సమావేశమైన ఆయన మండలంలోని ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వార్షిక ఇంక్రిమెంట్లు, పీఎఫ్ రుణాల మంజూరు తదితర అంశాలకు సంబంధించి, మండల స్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. పాఠశాలల నిర్వహణ, పాఠ్యాంశాల బోధన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

పాలకొండ: మండలంలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సింగన్నవలస, అంపిలి, వెలగవాడ, తంపటాపల్లి గ్రామాల పరిధిలో సేకరించిన ధాన్యాన్ని రెండు రోజులుగా మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లర్లతో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నాగూరు విద్యార్థులు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఐ.రాజేశ్వరరావు తెలిపారు. అండర్-17 లాంగ్‌జంప్‌లో దత్తి సాయి కుమార్, త్రో బాల్‌లో దత్తి నిత్యశ్రీ, సీహెచ్.గిరిప్రసాద్, నెట్‌బాల్‌లో ఎం.సౌందర్య, ఎ.అశోక్ కుమా ర్, అండర్-14 విభాగంలో ఎస్ఎస్.భానుశ్రీ ఇటీవ ల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులకు స్థానిక సర్పంచ్ కె.శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు.

రక్షణగోడకు మరమ్మతులు

గరుగుబిల్లి: తోటపల్లి పాత రెగ్యులేటర్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న రక్షణగోడకు జట్టు ట్రస్టీ డి. పారినాయుడు ఆధ్వర్యంలో శనివారం మరమ్మత్తు లు చేపట్టారు. రక్షణగోడను బాగుచేయాలని పలుమార్లు అధికారులను కోరినప్పటికీ పనులు చేపట్టకపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రమీల పనులను పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

గరుగుబిల్లి: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ ఎస్.నాగభూషణరావుకు శనివా రం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈనెల 20లోగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు బి.రామకృష్ణ, ఆర్.రాంబాబు, వై.యశోద, ఎం.శంకరరావు, సిబ్బంది రమణమ్మ, శారద, వీర్రాజు తదితరులున్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు

సీతానగరం: ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేతో రైతులకే మేలు జరుగుతుందని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని కోటసీతారాంపురం రెవెన్యూ పరిధిలోని గ్రామ పొలాల్లో భూముల సర్వేలో భాగంగా చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్(హద్దురాళ్లు ఏర్పాటు)ను ఆయన శనివారం పరిశీలించారు. రాష్ట్రంలో దాదాపు వందేళ్ల తర్వాత జరుగుతున్న భూముల సర్వేను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఈ సర్వే ద్వారా రైతులకు అసలు భూమి ఎంత ఉన్న విషయంతో పాటు భూమిపై సర్వహక్కులు ఉండేలా హక్కుపత్రాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. అంతేకాకుండా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు కూడా పరిష్కారమవుతున్నాయన్నారు. భూముల రీసర్వేకు గ్రామాలకు వస్తున్న సిబ్బందికి ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలన్నారు.



కోటసీతారాంపురంలో హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణ

నీలకంఠాపురంలో తాగునీటి సమస్యకు చెక్

సీతానగరం: మండలంలోని వెంకటాపురం పంచాయతీ, మధురా గ్రామమైన నీలకంఠాపురంలో దశాబ్దాలుగా నెలకొన్న తాగునీటి సమస్యకు జగనన్న ప్రభుత్వం చెక్ పెట్టింది. ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి ఫలితంగా గ్రామంలో కుళాయిల ద్వారా మంచినీటి సరఫరాకు జల్ జీవన్ మిషన్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి గ్రామంలో స్థలాన్ని పరిశీలించారు. దీంతో గ్రామస్తులకు త్వరలోనే మంచినీరు అందుతున్న నమ్మకం కలిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామానికి మంచినీరు అందించేందుకు రూ.18.50 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని, వీటితో ఓవర్ హెడ్‌ట్యాంక్, పైపులైన్, కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి, గ్రామస్తుల తాగునీటి సమస్య తీరుస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న డీఈఈ హనుమంతరావు, ఏఈ పవన్‌కుమార్

రైతులకు అండగా నిలవాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు

పాలకొండ రూరల్: గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ, వ్యవసాయాధికారులు సమన్వయంతో అన్నదాతలకు అండగా నిలవాలని మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ అధ్యక్షతన శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం అమ్మకాలకు సంబంధించి అధికారులు రైతుల పక్షాన నిలవాలని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్ కోరా రు. అలాగే ఆర్‌బీకే సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మద్దతు ధర, ధాన్యం గ్రేడింగ్, తూకం, రవాణా, ఇతర నిబంధనలు అమలు విషయంలో సహకరించాలని కోరారు. ముఖ్యంగా మిల్లర్ల విషయంలో ఉదాసీనత లేకుండా, అధికారులు నిబంధనలు అమలు చేయగలిగితే ప్రభుత్వానికి పేరు వస్తుంద ని అభిప్రాయపడ్డారు. ఏఓ వై.వాహిని మాట్లాడు తూ, బ్యాంక్ గ్యారెంటీలు పొందిన స్థానిక మిల్లర్లకు కొనుగోళ్లపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నా రు. తుపాను నేపథ్యంలో రంగుమారిన ధాన్యం కూడా ఆర్‌బీకేల ద్వారా సేకరించేలా చర్యలు చేపట్టినట్లు రెండో వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్ తెలిపారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో జీజీఎంపీ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీఓ డొంక త్రినాథులు వివరించారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు వేగంగా చేపడుతున్న ట్లు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలో నూతన రక్షిత మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణ పురోగతిని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవలిక సభ దృష్టి కి తీసుకువచ్చారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ మాధవరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి.మేరి, దశారత్నం, ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి, పశుసంవర్ధక శాఖాధికారి సిద్ధార్థ, ఆర్‌అండ్‌బీ జేఈ జగన్‌మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుపై వివరణ ఇస్తున్న ఏఓ వాహిని

పోలీస్ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

గుమ్మలక్ష్మీపురం: విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కిల్లక సత్యనారాయణ భౌతికాయానికి శనివారం ఆయన స్వగ్రామమైన గుమ్మలక్ష్మీపురం మండలం కళిగొట్టులో పోలీసు లాంఛనాల మధ్య కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పాలకొండ డీఎస్పీ కృష్ణారావు సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన ఖర్చుల నిమిత్తం రూ.25వేలను మృతుని అందజేశారు. పోలీస్‌శాఖ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం సకాలంలో వచ్చేలా కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పాలకొండ సీఐ సత్యానారాయణ, ఎస్ఐ ఎన్.ప్రసాంత్, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ ఉన్నారు.



పోలీసు లాంఛనాలతో సత్యనారాయణకు దహన సంస్కారాలు చేస్తున్న దృశ్యం

జాతీయస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థులు

సీతంపేట: జాతీయ స్థాయి క్రీడా పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో జావెలిన్ త్రో పోటీలో బి.దినేష్ గోల్డ్ మెడల్ సాధించాడు. ట్రిపుల్ జంప్ విభాగంలో ఊయక భద్ర సిల్వర్ మెడల్ పొందాడు. వీరితో పాటు మరికొందరు రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 24న మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్న విద్యార్థులను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అవసరమయ్యే సహకారం అందిస్తామన్నారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమశాఖ డీడీ మంగవేణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, పీడీ లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న పీఓ కల్పనాకుమారి

పర్యవేక్షణ తప్పనిసరి

పాలకొండ: పిల్లల చదువుపై తల్లితండ్రులు పర్యవేక్షణ చేయాలని ఓని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం బి. నాగమణి అన్నారు. పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిర్మాణాత్మక మూల్యాంకణాల అనంతరం విద్యార్థుల ప్రతిభ తల్లిదండ్రులకు తెలియజేశామన్నారు. సంగ్రహణాత్మక మూల్యాంకన ఫలితాలను నివేదించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తగిన సూచనలు ఉపాధ్యాయులకు అందించాలని తల్లిదండ్రులను కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాలవలస శారదాకుమారి, గొగుల సూర్యనారాయణ, దానేటి పుష్పలత, కుదమ తిరుమలరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం నాగమణి

అందరికీ రేషన్ అందేలా చర్యలు

భామిని: కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు అందేలా ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు సహకరించాలని తహసీల్దార్ అప్పారావు అన్నారు. ఆదివారం ఆయన మా ట్లాడుతూ, ఎండీయూ వాహనాలను ఆయా సచివాలయాల ముందు నిలిపి మిగిలిపోయిన కార్డుదారులకు సరుకులు అందించాలని సూ చించారు. ఒక్కో వాహనం రెండు సచివాల యాల పరిధిలోకి వస్తే.. ఉదయం ఒక సచివాలయం వద్ద, మధ్యాహ్నం రెండో సచివాలయం వద్ద నిలిపి ఉంచి సరుకులు అందివ్వాలన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బి.చంద్రశేఖర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను ఎంఈఓ పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ ప్రదర్శనలో కేజీబీవీకి చెందిన సామల మనస్విని ప్రాజెక్టు ప్రథమ స్థానం, టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎం.కెలేంద్ర ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. గ్రూప్ విభాగంలో మొదటి స్థానాన్ని గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.త్రివేణి బృందం, ద్వితీయ స్థానాన్ని కేజీబీవీకి చెందిన ఎల్.హారిక బృందం సొంతం చేసుకున్నారు. టీచర్స్ ప్రాజెక్ట్‌లో గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ ఉపాధ్యాయురాలు ఎం.రజిని ప్రథమ స్థానంలో నిలిచారు. వీరంతా జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బిడ్డిక భీముడు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు